క్లుప్తంగా

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొమ్మిడి మోహన్‌రెడ్డి, వంచ రవీందర్‌రెడ్డి, వన్నాల భిక్షపతిలను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భిక్షపతి వ్యక్తిగత ప్రయోజనాల కొరకు పార్టీకి ద్రోహం చేశారని ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతుకు గాయాలు



ఐనవోలు : వ్యవసాయ పొలంలో దున్నుతున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడగా రైతుకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. చిదురాల కొమురయ్య తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా ట్రాక్టర్ పొలంలో అదుపుతప్పి బోల్తాపడింది. కొమురయ్య ట్రాక్టర్‌పై నుంచి కిందకు దూకగా నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ డిపోకు మెరుగైన ఆదాయం

పరకాల : ఆర్టీసీ పరకాల డిపోకు మెరుగైన ఆదాయం లభిస్తోందని మేనేజర్ కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత కాలంగా నష్టాల్లో నడుస్తుండగా ఇటీవల డిపోకు అదనపు ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. రూ.28.46 లక్షల నష్టంలో ఉండగా ఈనెల 19 నాటికి వరకు రూ.1.06 లక్షల అదనపు ఆదాయంతో నష్టాలు తగ్గుముఖం పట్టినట్లు వివరించారు. ఆర్టీసీ స్టేజిల వద్ద ప్రైవేటు వాహనాలను నియంత్రించడంతో అన్ని ట్రిప్పుల్లోనూ లాభం వస్తుందని తెలిపారు. మరో 10 రోజుల పాటు ఆర్టీసీ సిబ్బంది ఇదే తరహాలో కృషి చేస్తే నష్టాలను పూడ్చుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా మహేష్



పరకాల : ఎమ్మార్పీఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడుగా బొచ్చు మహేష్‌ను నియమించినట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ పోరాటాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న క్రమంలోనే మహేష్‌ను నియమించినట్టు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా పని చేసి పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు.

బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్

పరకాల : బీఎస్పీ పరకాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎల్తూరి శ్రీనివాస్‌ను నియమించినట్టు రాష్ట్ర కార్యదర్శి మాదారపు రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు శ్రీనివాస్‌ను నియమించినట్టు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. యాదవనగర్, బాలసముద్రం, నిట్, వెస్ట్ సిటీ, మడికొండ, టేకులగూడెం, న్యూశాయంపేట విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే వరంగల్‌లోని ఆజంజాహి మిల్స్, స్టేషన్‌రోడ్డు, ఖిలా వరంగల్, శంభునిపేట, మామునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ ఒక ప్రకటనలో వివరించారు.

సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

హన్మకొండ అర్బన్: జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. జాతీయ స్థాయిలో 300 మంది విద్యార్థులు పాల్గొనగా శ్రీచైతన్య నక్కలగుట్ట బ్రాంచి నుంచి 42 మంది రూ.46 వేల నగదు బహుమతి, ప్రశంసపత్రాలు అందుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఇన్‌చార్జ్ రమేష్, ఉదయ్‌భాస్కర్ అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చైతన్, కోఆర్డినేటర్ మహేష్, రాంకీ పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య



ధర్మసాగర్ : బాధితులకు కళ్లద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : ఆరోగ్యవంతమైన తెలంగాణేర్పాటే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. శిబిరాల్లో 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరికీ ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని, అవసరమైతే కంటి అద్దాలు అందజేస్తారని చెప్పారు. అధికారులు, సిబ్బంది ప్రణాళికాయుతంగా పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీల్లోనూ కంటివెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కంటి సమస్యలున్న ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మ కవిత, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ గార్లపాటి జవహర్‌రెడ్డి, తహసీల్దార్ రజని, మండల వైద్యాధికారి గోపీనాథ్, సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మల్లకపల్లి సర్పంచ్ మునిగెల రాజు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణ...

ఆత్మకూరు : అంధత్వ రహిత తెలంగాణాయే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చూపు మందగించినా ఆస్పత్రికి వెళ్లలేని పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ రాధిక, స్పెషల్ ఆఫీసర్ రామ్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారిణి డాక్టర్ లలితాదేవి, మండల వైద్యాధికారిణి డాక్టర్ స్పందన, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, ఎన్కతాల్ల రవిందర్, దుంపల బుచ్చిరెడ్డి, మచ్చిక యాదగిరి, కుడుతల రమేష్, కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : పరీక్ష చేసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఐనవోలు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన కంటివెలుగు వైద్యశిబిరాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి పరిశీలించారు. సందర్శించారు. వైద్య పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అదేవిధంగా మన ఊరి– మన బడి కార్యక్రమంలో భాగంగా పున్నేలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మండల ప్రత్యేక అధికారి నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీఓ వెంకటరమణ, వైద్యాధికారి శ్రీనివాస్, సర్పంచ్ కుమారస్వామి ఉన్నారు.



నడికూడ : ఆహ్వాన పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ

పరకాల : పట్టణంలోని యునానీ ఆస్పత్రి ఆవరణలోని కంటివెలుగు కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి సందర్శించి పరిశీలించారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందించాలని సిబ్బందికి సూచించారు. అర్హులందరూ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆహ్వాన పత్రాల పంపిణీ

నడికూడ : కంటివెలుగు కార్యక్రమ ఆహ్వాన పత్రాలను అంగన్‌వాడీ కేంద్రం–2 టీచర్ సంపూర్ణ మండల కేంద్రంలోని ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడారు. అంధత్వ రహిత సమాజం లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆదేశాలకు మేరకు చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించాలి



ఎల్కతుర్తి : వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏసీపీ

ఎల్కతుర్తి : వాహనదార్లు నిబంధనలు పాటించాలని ఏసీపీ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ జంక్షన్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్సై పరమేష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడారు. వాహనాల ఆర్సీ, ఇతర పత్రాలు కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే చీటింగ్ కేసు నమోదు చేస్తామన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఒక వాహన యజమానిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



దామెర : ఆటోను తనిఖీ చేస్తున్న ఎస్సై, సిబ్బంది

దామెర : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడుపుతున్న కలేష రఘు అనే వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు వాహనం నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసినా, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసినా చీటింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపతే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సిద్దయ్య, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ స్థల పరిరక్షణకు చర్యలు

దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని పరిరక్షించడానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ రియాజుద్దీన్ తెలిపారు. ఆ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సదరు అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి అంగన్‌వాడీ ఆట వస్తువులను తొలగించాడంటూ అధికారుల దృష్టికి వెళ్లగా తహసీల్దార్ విచారణ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన ముంద్రాతి సీతారాములు 25 ఏళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం కోసం 7 గుంటల స్థలాన్ని దానం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. 2002లో ఆ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారని, పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు, బోర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి దాత దానం చేసిన భూమి కబ్జాకు గురైనట్టు సమాచారం అందడంతో పరిశీలించినట్టు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి ఫిర్యాదు మేరకు రికార్డులు పరిశీలించి ఆక్రమణకు గురైన స్థలానికి బౌండరీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ భాస్కర్ రెడ్డి, సర్వేయర్ కవిత రాణి తదితరులున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రియాజుద్దీన్

కాషాయ జెండా ఎగరాలి

● హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

భీమదేవరపల్లి : హుస్నాబాద్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరాలని మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. ఇటీవల రాజీనామా చేసిన కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మాణిక్యాపూర్ ఎంపీటీసీ మామిండ్లపల్లి గోపీశర్మతో పాటు కాంగ్రెస్ నాయకులు ఒద్దుల సంపత్, మాట్ల మొగిలి, కిరణ్, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటయ్య తదితరులు బీజేపీ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడారు. బీజేపీ ద్వారానే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. అనంతరం ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడారు. త్వరలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈనెల 26న ముల్కనూర్‌లో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పృథ్వీరాజ్, భారత తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఊసకోయిల ప్రకాష్‌కు కాషాయ కండువా కప్పుతున్న ఈటల రాజేందర్

పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం

పరకాల : పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలోని 7, 8వ వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, దళితబంధు కమిటీ కన్వీనర్ సోదా రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ ద్వారా మంజూరైన కోటి రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్లెల జ్యోతి, అడప రాము, ఏకు రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైడ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామంలో జెడ్పీటీసీ నిధుల నుంచి కేటాయించిన రూ.3.25 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను జెడ్పీటీసీ కొడెపాక సుమలత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రావుల సరిత రాజిరెడ్డి, తిప్పర్తి సాంబశివరెడ్డి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరకాల : సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి



నడికూడ : పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కొడెపాక సుమలత

రైతుల ఆత్మహత్యలకు పాలకులే కారణం



జగన్ కుటుంబానికి బియ్యం అందజేస్తున్నసురేష్

కమలాపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తప్పుడు విధానాలే రైతుల ఆత్మహత్యలకు కారణమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక జాతీయ కన్వీనర్ దాసు సురేష్ తెలిపారు. మండలంలోని కానిపర్తి గ్రామానికి చెందిన రైతు బైరం జగన్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా అతడి కుటుంబానికి సురేష్ శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులతోపాటు నగదు సాయం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడారు. రైతులను ఆదుకోవడంలో పాలకులు విఫలమౌతున్నారని విమర్శించారు. భూస్వాములు, బడా రైతులకు మాత్రమే రైతుబంధు అందుతోందని చెప్పారు. పేద రైతులకు అనేక సాకులు చూపుతూ రైతుబంధును ప్రభుత్వం వర్తింపజేయడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు, దళారులకు కొమ్ముకాస్తూ రైతుల ఆత్మహత్యలకు పరోక్షంగా కారణమౌతున్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని ప్రజలను కోరారు. రైతులకు బీసీ రాజ్యాధికార సమితి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల కిరణ్, చాపర్తి కుమార్ గాద్గే, ఊరుగొండ శివ, బైరం జగదీష్, సతీష్, కోడిగూటి అశోక్, దాసరి సారమ్మ, ఐలయ్య, రామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐనవోలులో కేంద్ర మంత్రి పర్యటన



ఐనవోలు: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార శాఖ కేంద్ర మంత్రి బీఎల్ వర్మ మండలంలో శనివారం పర్యటిస్తారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. మంత్రి మధ్యాహ్నం 3 గంటలకు ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి వారిని దర్శించుకుంటారని, సాయంత్రం 6 గంటలకు సత్యం గార్డెన్‌లో ఆయుష్మాన్ భారత్ పథకంపై నిర్వహిస్తున్న సమావేశానికి హాజరై మాట్లాడుతారని చెప్పారు.

శ్రేణులకు అండగా ఉంటా : చల్లా



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని కటాక్షపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ద్వారానే అన్ని తరగతుల ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ రాధిక, స్పెషల్ ఆఫీసర్ రామ్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారిణి డాక్టర్ లలితాదేవి, మండల వైద్యాధికారిణి డాక్టర్ స్పందన, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, ఎన్కతాల్ల రవిందర్, దుంపల బుచ్చిరెడ్డి, మచ్చిక యాదగిరి, కుడుతల రమేష్, కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయం

దామెర : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమాన్ని చేపట్టిందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోగిల్వాయిలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన ‘మన ఊరు–మన బడి’ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేసేలా తరగతి గదుల నిర్మాణం, ఇతర పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తాగునీటి, ఇతర సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, పీఏసీఎస్ డైరెక్టర్ గుండ చంద్రమోహన్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి సరళ, ప్రధానోపాధ్యాయుడు రామానుజం పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మాలకుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

కాజీపేట రూరల్: మాలకుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాపూజీనగర్ పోచమ్మగుడి ప్రాంగణంలో ఆ తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మర్యాల కృష్ణ, బండి విజయ్ ఆధ్వర్యంలో సంఘం క్యాలెండర్‌ను చీఫ్‌విప్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్ నర్సింగరావు, సంఘం బాధ్యులు గోవర్దన్, కోంద్ర నర్సింగరావు, సిరిల్‌లారెన్స్, నీరటి సాయిరాజ్, మైలారం శంకర్, సిహెచ్.కొమ్మాలు, కాశేశ్వరపు వెంకటేష్, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీపై పాలకుల వివక్ష

ఎల్కతుర్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ పట్ల వివక్ష పాటిస్తున్నాయని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ నేతల జయంతులను అధికారికంగా నిర్వహిస్తున్న క్రమంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఏటా జనవరి 23న దేశ్ ప్రేమీ దినంగా పాటిస్తూ సెలవు దినంగా ప్రకటించాలని, సుభాష్ చంద్రబోస్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 23న సుభాష్ చంద్రబోస్ జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి మొలుగు హరికృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముత్యాల హరీష్‌రెడ్డి, నాయకులు అభిలాష్, శంకర్, రాజేష్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

డీఏ బకాయిలు విడుదల చేయాలి

విద్యారణ్యపురి: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. హనుమకొండలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2020 పీఆర్‌సీ ఏరియర్స్ బకాయిలను 18వాయిదాల్లో నెలనెల విడుదల చేయాలని సూచించారు. ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. అలాగే, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వీలైనంత తొందరగా విడుదల చేయాలని పేర్కొన్నారు. అప్పీళ్లకు సమయం ఇచ్చి ఫైనల్ బిల్లులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 13 జిల్లాల స్పౌజ్ బదిలీలల షెడ్యూల్‌ను ముందే ప్రకటించి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ హనుమకొండ మండల అధ్యక్షుడు మధుమురళి, కార్యదర్శి రాజ్‌కుమార్, అధ్యాపక జ్వాల సంపాదకులు సుదర్శన్‌రెడ్డి, బాధ్యులు సుమిత్రాదేవి, ఉప్పలయ్య, అనిత, మహేందర్‌రెడ్డి, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ఆల్ పెన్షనర్స్ మహాసభలు

నయీంనగర్: ఈనెల 23, 24 తేదీల్లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ అర్బన్ జిల్లా 6వ మహాసభలను హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్ష, కన్వీనర్లు అడ్లూరు నరసింహమూర్తి, తూపురాణి సీతారాం తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, పెన్షనర్స్, కార్మిక వ్యతిరేఖ విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షనర్లకు రావాల్సిన 3 వాయిదాల కరువుభత్యం ఇంకా ప్రకటించలేదని తెలిపారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ కింద వైద్యం అందడం లేదని వాపోయారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సభలకు పెన్షనర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెండ్యాల బ్రహ్మయ్య, టి.నరసింహస్వామి, సంపత్‌కుమార్, మల్లిక, వీరన్న, నిర్మల, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.